# బ్రమమ కథ

ఆర్. వి. జి. కృష్ణమూర్తి



ఉదయం పదిగంటలు కావస్తోంది. నాకు పనివున్న పెద్దమనిషి వూళ్ళో లేడు. ఆయనకోసం ఎదురు చూస్తూ నాలుగు రోజుల్నుంచీ హోటల్లోనే వుంటున్నాను. ఏమీతోచక అలా బాల్కనీలోనుంచుని ట్రంకు రోడ్డులోకి చూస్తున్నాను. సన్నగా వాన జల్లు పడుతూంది. ఎదుట ఫ్యాన్సీకొట్టులో ఎవరో అమ్మాయి హాండ్‌బాగ్సు బేరం చేస్తూంది. ఆ ప్రక్కనే కిళ్లీకొట్టుముందు చలికి వణుకుతూ ఓ కుర్రాడు బీడీదమ్ము గట్టిగా లాగుతున్నాడు. రోడ్డుమీద జనం హడావుడిగా పరుగులు తీస్తున్నారు. నీటుగా డ్రెస్ చేసుకున్న కుర్రాళ్ళు వచ్చేపోయే కార్లు వెదజల్లే నీరు మీద బడకుండానూ, అక్కడక్కడా నిలిచిన నీటిలో బూటుకాలు వేయకుండానూ తీగమీద నడిచే సర్కసు అమ్మాయిల్లా నడుస్తున్నారు. పుస్తకాలు తడిసినా పర్వాలేదుగాని, క్రాపింగు చెడ గూడదని గాబోలు పుస్తకాలనే తలకడ్డం పెట్టుకు వెళ్తున్నారు కాలేజి విద్యార్థులు. రోడ్డువార నిల్చున్న రిక్షావాడు బేరం కోసం ఆశగా జనాన్ని పలకరిస్తున్నాడు.

ఓ జట్కా వచ్చి హోటలు ముందాగింది. దాన్లోంచి టిప్‌టాప్‌గా వున్న ఓ కుర్రాడు దిగాడు. అతగాడి వెనకాలే మెరపులాంటి అమ్మాయి దిగింది. మరో నాలుగైదు నిమిషాల్లో ఆ యిద్దరూ పైకి వచ్చేశారు. ఆకుర్రాడ్ని చూడగానే నా సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయినయి.

ఎగిరి గంతేసి 'ఒరేయ్‌జగగ్గా—జగన్నాథం' అని కేకపెట్టాను. అతను నావైపు చూచాడేగాని ఏమీ జవాబివ్వలేదు. దగ్గరకు పరుగెత్తుకెళ్ళి 'ఒరే జగన్నాథం నేన్రా మూర్తిని' అన్నాను భుజంపట్టి వూపేస్తూ.

'అయాం సారీ యు ఆర్ మిస్టేకన్— నాపేరు జగన్నాథంగాదు' అన్నాడు తీవిగా.

'కొయ్‌రాకొయ్ ఒరేయ్, నాదగ్గర్రా నీ వేషాలు' అన్నాను. అతను కళ్ళెర్రచేసి 'షటప్' అన్నాడు. వెంటనే పదహారో నంబరు రూములోకివెళ్ళి తలుపు మూసేశాడు.

తల కొట్టేసినట్టయింది నాకు!

ఆగదికి అటువేపు అంటే పదిహేనులో నేనుంటున్నాను. ఇటువేపు అంటే పదిహేడులో ఒక పంచాయతీబోర్డు ప్రెసిడెంటు వుంటున్నాడు. ఆయన నల్లగా, లావుగా వుంటాడు. గది తలుపులు రెండూ తెరవందే ఆయన అటు లోనికీ వెళ్ళలేడు, ఇటు వెలుపలికీ రాలేడు. కిటికీ తలుపులు తెరిచినా, ఫ్యాను రివ్వున తిరిగినా ఆయనకు చాలినంతగాలి సరఫరా గావడంలేదుట. రాత్రి పూట గాలిలేక ఆయన పడే బాధను గురించి వుదయాన్నే కామన్ బాత్రూంవద్ద వుపన్యాసం యిస్తుంటాడు.

పదహారుకు ఎదుటవుండే గదిలో ఓ మెడికల్ రిప్రజెంటటివ్ కుర్రాడుంటున్నాడు. కుర్రాడేమో సన్నగా, అందంగా వున్నాడుగాని, పెట్టుకున్న కళ్ళద్దాలు మాత్రం బాగా లావయినవి.

రిప్రజెంటిటివ్‌కు ప్రక్క రూములో ఓ వ్యాపారస్తుడుంటున్నాడు. వ్యాపారస్తుడంటే మామూలుగా అందరు వ్యాపారస్తులాంటివాడు గాదట. రిస్టువాచీలు, ట్రాన్సిస్టర్లూ, బంగారం మాత్రమే బజార్లోకంటే తక్కువ ధరలకు అమ్ముతాడట. 'మా వ్యాపారం బహు డేంజరైంది బ్రదర్ ఆ వ్యాపారం చేయాలంటే గుండె కావాలి. వస్తే లక్షలు పోతే జైలుకి!' అన్నాడోసారి. మిగతా గదుల్లో ఎవరెవ

రుంటున్నారో నాకు తెలియదు. వీళ్లను గురించైనా ఎందుకు చెప్పానంటే పదహారో రూములోకి వెళ్లిన యువకుడి చేత నేను అవమానింపబడడం వీళ్లు ముగ్గురూ చూచారు.

రూములో కూర్చున్న నాకు ఆ యువకుడు జగన్నాథం కాడని ఎంతగా నమ్మాలనుకున్నా నావల్ల గావడంలేదు. జగన్నాథాన్ని చూచి రెండేళ్లయింది. వాడితో నాకున్న సాన్నిహిత్యం ఎంతటిదంటే వాడి శరీరం మీద ఎక్కడెక్కడ పుట్టుమచ్చలున్నాయో చెప్పగలను. వాడికే కూరలు యిష్టమో చెప్పగలను. వాడెప్పుడెప్పుడు సిగరెట్టు కాలుస్తాడో చెప్పగలను. వాడి బంధువర్గంలో రెండేళ్ల క్రితంవరకూ పుట్టినపాప పేరుతో సహా చెప్పగలను. అయితే యిదేమిటి?

* * *

ఒకానొక మహర్షి కాకి ముక్కులోంచి వూడపడ్డ ఎలుకను బ్రతికించి కాలానుగుణ్యంగా దానిని పిల్లిగానూ, కుక్కగానూ పులిగానూ మార్చినట్టు, ఆ హోటలు కట్టడం మొట్టమొదట చింతపండు గోడౌనుగా వుండేది. ఆ తర్వాత పిండి మిషనుగా మారింది. మరి కొన్నాళ్లకు అందులో ఫర్నిచరుషాపు వెలిసింది. ఆ తర్వాత కాఫీ హోటలయింది. ఇప్పుడు లాడ్జింగుగా మారిపోయింది. మళ్లీ ఎప్పుడు అది రూపాంతరం చెందుతుందో ఏమోగాని, యిప్పుడుమాత్రం గదికీ గదికీ మధ్యనుండేవి గోడలుకావు. మామిడి చెక్కలకు ఆకుపచ్చ రంగువేసి నుంచోబెట్టారు. గదిలో వెలిగేది ఎలక్ట్రిక్ బల్బేగాని అది అసమర్థుని కోపంలా వెలవెలా బోతుంటుంది. తిరిగేది సీలింగ్ఫ్యానే గాని అది ఎప్పుడు విరిగి విష్ణుమూర్తి చక్రంలా కుత్తుక తెగ వేస్తుందో అనిపిస్తుంటుంది.

పోతే ప్రతిగదికీ ఓ మంచం, దానిపైన ఓ పరుపు లాంటిదీ వుంటుంది. పరుపును పరీక్షించి చూస్తే దాన్లో దూదివుందో లేదో తెలీదుగాని, నల్లులు మాత్రం పుష్కలంగా పుష్టిగా కనిపిస్తాయి.

అయితే మాత్రమేం గాక! ఎండకీ వానకీ తలదాచుకునేందుకు ఆ పట్నంలో రోజుకు రెండు రూపాయల అద్దెకు మరిన్ని సౌకర్యాలున్నగదిని సమకూర్చుకోడం కష్టసాధ్యం!

ఏదైనా రహస్యం చెప్పుకునేప్పుడు 'జాగ్రత్త! గోడలకి చెవులుంటాయి అంటుంటారు' కాని అక్కడ మాట్లాడిన ప్రతిమాట ప్రక్కగదుల్లో వాళ్లకి గంట వాయించి నట్టుగా వినిపిస్తుంటుంది. ఏదైనా రహస్యమైతే గుసగుస లాడుకోవల్సిందే! అయితే ఏదో గుసగుసలాడుతున్నారని తెలిసిన వెంటనే చెక్కలకు చెవులు మొలుచుకొస్తాయి!

* * *

వర్షం బాగా ఎక్కువైంది. పట్టపగలే చీకట్లు కమ్ముకుంటున్నాయి. లైట్లు వేసి ఫ్యాన్లు ఆపు చేసుకున్నాం. అప్పుడప్పుడూ ప్రక్క గదిలోంచి నవ్వులు వినిపిస్తున్నాయి.

జగన్నాథానికి ఏడాదిక్రింద పెళ్లయింది. శలవు దొరకినందునా, దూరాభారమైనందువల్లా పెళ్లికి వెళ్లలేకపోయాను. అయినా యిప్పుడా అమ్మాయిని చూస్తే జగన్నాథం 'లక్కీఫెలో' అనిపించింది: తీగలా, సన్నగా. నాజూగ్గా వుంది. ముక్కు కొస దేలింది. పెదవులు అందంగా వంపులు దిరిగివున్నాయి. కట్టుకున్న చీర, తొడుక్కున్న జాకెట్టు, అల్లుకున్న జడ, పెట్టుకున్న సన్నటి గొలుసు— యివన్నీ గూడా ఆ అమ్మాయి 'టేస్టు'ను తెలియజేస్తున్నాయి. మొత్తానికి జగన్నాథం భార్య 'లవ్లీగర్ల్ !'

మనిషిలో మార్పేమీ లేకున్నా జగన్నాథం వేషంలో మార్పొచ్చింది. మూతి మీద మీసంలో మార్పొచ్చింది. కళ్లలోని దర్జాలో మార్పొచ్చింది.

ఏమిటో...!...అతగాడు నేను జగన్నాథాన్ని కాదని ఎంతగా గోలెట్టినా, అతడే జగన్నాథమని, కాకున్నా అతడే జగన్నాథం కావాలని మనసు వూరకే గోలెడ్తాంది.

రాత్రి ఎనిమిదైంది. అలా బాల్కనీలోకి బయల్దేరాను. రిప్రజెంటేటివ్ కుర్రాడు కారిడార్లో పదహారో నంబరు గదిముందు కాళ్లకు జోళ్లు లేకుండా అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. పంచాయతీ ప్రెసిడెంటు రెండు గదులకు మధ్య చెక్కల గోడకు చెవి ఆనించి కూర్చున్నాడు. వ్యాపారి ట్రాన్సిస్టరు కట్టేసి పదహారుమీద చతువులను నిలిపి, తన శ్రవణేంద్రియానికి పాములా శబ్దాన్ని రిసీవ్ చేసే శక్తి లేనందుకు చింతిస్తున్నాడు.

అలా బాల్కనీలోకి వెళ్లానో లేదో వాళ్లు ముగ్గురూ నా వెంట వచ్చేశారు. అందరికీ వచ్చిన సందేహం ఒక్కటే 'వీళ్లిద్దరూ భార్యా భర్తలేనా—లేక...' ఒళ్లు మండిపోయింది.

'వాళ్లిద్దరూ మొగుడూ పెళ్లాలే! వాడెవడో గాదు. మా జగన్నాథం. నా డియరెస్టు ఫ్రెండు' గట్టిగా అరచాను. వాళ్లు వెకిలిగా నవ్వి వెళ్లిపోయారు గదుల్లోకి.

భోంచేసి గదిలోకొచ్చాను. ప్రక్క గదిలో జంట కొంచెం గట్టిగానే మాట్లాడుకుంటున్నారు.

'పెళ్లంటూ చేసుకోకుంటె మనం భార్యా భర్తలంగామా ఇందూ నా మాట విను. రేపో యిల్లు చూచుకుని కాపురం పెట్టేస్తాం' అంటున్నాడు అతను.

'అలా కుదరదు మధూ! మన పెళ్లి జరగాల్సిందే. రేపే రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్దాం' అంది ఆమె.

మధు! అయితే యితను నిజంగా జగన్నాథం, ఆమె అతని భార్య కాదా! లేక యిదంతా నాటకమా !

ఒక వేళ జగన్నాథమే పేరు మార్చుకుని యీ అమ్మాయిని లేవదీసుకు వచ్చాడేమో! అందుకే పెళ్లీ గిళ్లీ వద్దు. ఏకటూకీగా కాపురం పెట్టేస్తామంటున్నాడు. ఆలోచిస్తూంటే మెదడు దిమెక్కి పోతూంది.

'ఇందూ! నీ పట్టుదల నువ్వు వదలకుంటే నీ దారి నీది, నా దారి నాది. పెళ్లీ గిళ్లీ నా కిష్టంలేదు: అంతే!' విసురుగా అంటున్నాడు.

'మాయమాటలు చెప్పి, నమ్మించి, చివరకు నువ్వు యిలా చేస్తావా మధూ! కొన్ని గంటలకే నీకు నేను చేదైపోయానా మధూ!' జాలిగా వున్నాయి ఆమె మాటలు.

'చేదూ లేదు. పులుపూ లేదు. వున్న నగలన్నీ తీసుకు వచ్చేయమంటే ముష్టి ఒంటిపేట గొలుసుతో వచ్చావు. వున్న బట్టలన్నీ సూట్కేసులో సర్దుకు వచ్చేయమంటే కట్టుకున్న చీరతో వచ్చావు. రేపేం కట్టుకుంటావు ? నా దగ్గరున్న యీ వందా అయిపోతే గడియారం అమ్మతాననుకో! అదీ అయిపోతే వుంగరం గూడా అమ్మతాననుకో! ఆ తర్వాత—వుద్యోగం

దొరక్కపోతే అప్పుడు నీ ఒంటిపేట గొలుసుతో మనం ఎన్నాళ్లు తింటాం? ఎన్ని సినిమాలు చూస్తాం? ఎంత సరదాగా వుండగలమో నువ్వేమైనా ఆలోచించావా?'

'నన్ను పెళ్లి చేసుకున్నవాడు నన్ను పోషించగలడనే అనుకున్నాను. చీరలు కొనివ్వగలడనే అనుకున్నాను. సరదాలు తీర్చగలడనే అనుకున్నాను. స్వర్గం చూపిస్తాడనే అనుకున్నాను. అన్నిటినీమించి అతడి విశాల వక్షం మీద తల ఆన్చి యీ ప్రపంచాన్నే మరచి హాయిగా నిదురిస్తామనే అనుకున్నాను మధూ! కాని...'

'కాని...'

'మోసపోతా ననుకోలేదు. నాశనమై పోయాను, సర్వనాశనమై పోయాను మధూ!' ఆతర్వాత ఆ అమ్మాయి వెక్కిళ్ళ బరువైన వుచ్ఛ్వాస నిశ్వాసలు వినిపించాయి.

'ఇందూ! ఎందుకింత ఆవేశపడుతావ్?'

'ఛీ! నువ్వూ మనిషివేనా? నీకూ హృదయముందా? నువ్వు దగా కోరువి. దగుల్బాజీవి. పైపై మెరుగులుచూపి నన్ను నాశనం చేశావు వెళ్ళు మధూ... వెళ్ళు మళ్ళీ యీ జీవితంలో నీ ముఖం చూపకు.'

'ఇందూ'

'హు...ఇందూ... యింకా ఏ ముఖం పెట్టుకుని పిలుస్తావ్? ఛీ...వెళ్ళు... ముందిక్కడ్నించి వెళ్లిపో' వస్తూన్న ఏడుపును ఆపుకుందుకు గట్టిప్రయత్నచేస్తున్న శబ్దమైంది. తలుపుగడి తీసినట్టుగాని, మధు అనబడే ఆ యువకుడు వెళ్ళినట్టు గాని అలికిడి వినరాలేదు

ఆ తర్వాత నిశ్శబ్దం ఎంతసేపటికీ మరోమాట వల్లకూ వినిపించలేదు

నిద్రపట్టక పట్టక ఎప్పుడు పట్టిందో ఏమో, కళ్ళు తెరిచేప్పటికి వర్షం బాగా తగ్గిపోయి కిటికీలోంచి సూర్యభగవానుడు తొంగి చూస్తున్నాడు. కాలకృత్యాలు తీర్చుకుని నాకు పనివున్న పెద్దమనిషి కోసం బయల్దేరుదామను కుంటున్నాను. మళ్ళీ ప్రక్కగదిలోంచి మాటలు వినిపించాయి. రాత్రి జరిగిందంతా జ్ఞాపక మొచ్చింది.

'ఇదుగో బుల్లీ ఆడెవుడో వుండాకోరు విదవ. ఏం పొయ్యింది. నువ్వేమీ దిగులు పడవాక. నేనుండా నీకేం గావాల్నో చెప్పు. మీ అమ్మా నాయన కాడికిపోతావా చెప్పు రైలెక్కిస్తా దారి కర్చులకి డబ్బులిస్తా. లేదా వాళ్ళ అడ్రసియ్యి తంతిగొట్టి పిలిపిస్తా' చెప్పకుపోతున్నాడు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు.

'పోతూపోతూ నామెళ్ళో గొలుసుకూడా పట్టుకెళ్ళాడండీ! చేతిలో పైసాలేకుండా కట్టుబట్టలతో నన్ని హోటలుగదిలో విడిచి పారిపోయాడు.' వెక్కిళ్ళమధ్య చెబుతూందా అమ్మాయి.

'ఇదుగో — యేడవకుబుల్లీ' చూడు ఆ టిపిను తిని, కాపీతాగు. నేనీలోగా బజారు కెళ్లి బట్టలు పట్టుకొస్తా. నువ్వేం బయపడవాకు...తిను బుల్లీ.'

ఆమె టిఫిను తినడం మొదలెట్టిందేమో —

'ఆ అట్ట మావంచి బుల్లివి, ఇదో యిప్పుడేవస్తా' అంటూ వెళ్ళాడు ప్రెసిడెంటు.

వాడు జగన్నాథంగానీ, మధుగానీ, ఎంత పనిచేశాడు? అయినింటి ఆడపిల్లను తీసుకొచ్చి కాకులకూ గద్దలకూ వదిలివెళ్ళాడు రాస్కెల్!

మళ్ళీ మగగొంతు వినిపించింది.

'అయాం సారీ మాడమ్ మీకు కలిగిన కష్టానికి నా సానుభూతి.'— ఇది మెడికల్ రిప్రజెంటిటివ్ గొంతు.

'నేనీ కుర్చీలాక్కుని కూర్చుంటే మీకేం అభ్యంతరం లేదనుకుంటాను'

'లేదు కూర్చోండి'

'అయినా అతనలా వెళ్లిపోవడమేమిటి? ప్రేమించు కున్నారు— దట్స్ రైట్ ఇలా అర్ధాంతరంగా మిమ్మల్ని వదిలివెళ్ళిన వాడ్ని నేనైతే కాఫీలో సైనైడ్ కలిపి తాగించే వాడ్ని. అసలు మిమ్మల్ని చూస్తూ కూర్చుంటే చాలదుటండీ, మల్టీ విటమిన్ టానిక్కు పుచ్చుకున్నట్టుంది'

ఆ అమ్మాయి సన్నగా ఏడుస్తున్నట్టుంది.

'చూడండి. మీ పేరేమిటోగాని రాత్రి అతను 'ఇందూ' అంటూంటే విన్నాను. మిమ్మల్ని నేనూ అలానే పిలుస్తాను. అభ్యంతరమా?'

'పిలవండి.'

'చూడండి. ఏడ్చి ఏడ్చి మీ కళ్ళలా వాచివున్నాయో! మీరు చాలా వీక్‌గా వున్నట్టున్నారు. వుండండి. నా వద్ద మంచి టాబ్లెట్సు, టానిక్సు శాంపిల్సున్నాయి తెచ్చిస్తాను.' అని లేచివెళ్లి క్షణంలో తిరిగొచ్చి 'యీ టాబ్లెట్సు వుదయం ఒకటీ, సాయంత్రం ఒకటి వేసుకోండి. యీ టానిక్కు భోజనానికి ఓ అర్ధగంట ముందు టీస్పూనుతో త్రాగండి. మీరు వారం రోజుల్లో పోల్చుకోలేనంతగా మారిపోతారు.'

'అతగాడు వెళ్లేనాడు వూరికే వెళ్లాడా? మెళ్ళో గొలుసు తీసుకెళ్ళాడు. చేతిలో పైసా లేకుండా చేసి వెళ్లాడు.'

'ఒట్టి బ్రూట్‌లా వున్నాడు. మీరేం భయపడకండి. ఇదుగో యీ యాభై వుంచండి. మీరు ముందు లేచి ముఖం కడుక్కోండి. ఆ—మరిచాను. మీ వద్ద టాయిలెట్ సామాన్లు ఏమీ లేనట్టుంది. ఇప్పుడే పట్టుకొస్తా. సాయంత్రం టౌను హాల్లో మంచి డ్యాన్సు ప్రోగ్రాంవుంది రెండు టిక్కెట్లు బుక్‌చేస్తాను మీరు కాస్త రిలాక్సయినట్టూ వుంటుంది.' అంటూ రిప్రజెంటటివ్ కెళ్ళాడు.

అతను వెళ్లిన అయిదు నిమిషాల్లో ప్రెసిడెంటు వచ్చాడు.

'బుల్లీ — యీ చీర నీ ఒంటికి బాగా నప్పుద్దని తెచ్చినా. దీని ఖరీదు యాభై రూపాయలు. తీసుకో. ఇదుగో, సాయంత్రం ఆరింటికొస్తా యీ చీర కట్టుకుని రడీగా వుండు. సినిమాకెల్దాం...సరేనా' అన్నాడు గద్గద స్వరంతో.

ఆ అమ్మాయి ఏమన్నదో నాకు వినిపించలేదు.


'ఈ యాభై రూపాయలూ నీకాదుంచుకో బుల్లీ. మళ్ళీ ఆరింటికొస్తా—ఏం?' అని వెళ్ళాడు.


అప్పటికే నేను వచ్చి అయిదురోజు లయింది. నాకు పని వున్న పెద్ద మనిషి వచ్చాడో లేదో తెలుసుకు రావాలి. గదికి తాళం వేసి బయల్దేరాను. ఆయన రాలేదు. కోపంతో, విసుగుతో వీధులంబడి చెడామడా తిరిగాను.

ఎక్కడ తిరిగినా, ఏం జేసినా ఆ పదహారో నంబరు గదిలో వాళ్ళు మరపుకు రావడం లేదు, యీ ప్రెసిడెంటూ, ఆ

అశోకా
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేటు) లిమిటెడ్

ఏజెంట్లు కావలెను
30% కమిషన్‌మీద
ప్రఖ్యాత "ఎస్కార్ట్"
3 బ్యాండ్, ఆల్ వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సి
స్టర్లు విక్రయించుటకు ఏజంట్లు కావలెను.
ఉచిత షరతులకు, ఉచిత ట్రాన్సిస్టర్ కై
వెంటనే వ్రాయండి.
JAPCO. (APTWM 27)
P.O. Box 1382, Delhi—6.








మందుల కుర్రాడూ ఆ అమ్మాయిని ఏం చేయదలచుకున్నారో? ఆలోచిస్తూంటే ఆ అమ్మాయిది గూడా కొంత తప్పులేక పోలేదనిపిస్తూంది. ఎవరో ముక్కూ మొహం తెలీని కుంకలంతా చీరెలూ, టాయిలెట్ సామాన్లూ, డబ్బూ యిస్తూంటే మాట కోసమయినా వద్దనకుండా పుచ్చుకుంటూంది.

భోంచేసి, కిటికీ కొట్టు దగ్గర నిల్చుంటే ఎవరిదో బలమైన చెయ్యి భుజం మీద పడి వెనక్కి తిరిగి చూచాను. ఎవరో కాదు, జగన్నాథం! హోటల్లో చూచిన జగన్నాథానికీ, యితనికీ వేషంలో తేడా వుంది. అతను టెరిలిన్ పాంటూ, షర్టూ వేసుకున్నాడు. ఇతనేమో పైజమా, లాల్చీ ధరించాడు. అతనికి సన్నటి అందమైన మీసకట్టుంది. ఇతనికి అలాంటిదేమీ లేదు.

'ఏమిటోయ్. అలా కొత్తవాణ్ణి చూచినట్టు చూస్తున్నావ్' అన్నాడు.

హోటల్లో జరిగిందంతా చెప్పాను. 'నీకూ అతగాడికీ యింత దగ్గర పోలికలెలా వచ్చాయి?' అన్నాను.

'ఏమో' అన్నాడు. నా తెలివి తక్కువ ప్రశ్నకి నవ్వుకున్నాను. ఆ తర్వాత జగన్నాథం తన వుద్యోగం పోయిందని చెప్పాడు. నా ఖర్చుతో తిని, సిగరెట్లు తగలేసి 'అర్జంటు పనుంది' అంటూ వెళ్ళాడు.

మూడవుతోంది. కాసేపు విశ్రాంతి తీసుకుందామని రూము కెళ్ళాను. అప్పుడే వ్యాపారస్తుడు పదహారో నెంబరు గదిలో కెళ్తున్నాడు.

'మీరింకా విచారంగా వుండడం బాగులేదు. ఈ స్క్వేర్ వాచి మీ చేతికి బాగా సూట్ అవుతుంది. దీనివెల రెండొందలు కానీండి, మూడొందలు కానీండి, నాకు లెక్కలేదు. దీన్లో నేను వేలు సంపాదించాను. వేలు ఖర్చుపెట్టాను. మీ పేరు ఇందుమతి అనుకుంటాను. ఇది మీకు నా బహుమతి. సాయంత్రం ఆరుగంటలకు నేను టాక్సీ తీసుకొస్తాను. సముద్రపు టొడ్డున గెస్టు హవుస్‌లో రూమ్ బుక్ చేశాను. మీ చేతిలో డబ్బేమీ లేదన్నారుగా. ఈ యాభై వుంచండి. ఆరింటికి రెడీగా వుండండి' అంటూ మెట్లుదిగి రోడ్డు మీదకి వెళ్ళిపోయాడు.

ఇప్పుడీమె ఏం చేస్తుంది?

ముగ్గురివద్దా డబ్బు దస్కం తీసుకుంది. ముగ్గురూ సాయంత్రం ఆరు గంటలకు వేరువేరుగా ఎంగేజిమెంట్లు ఫిక్స్ చేసేశారు. ఈమె ఎవరికి నో అంటుంది? ఎవరికి సారీ అంటుంది? మొత్తానికి ఎవరో వెరజాణగానే వుంది. ఈ పూటలో దగకముందే ఆ అబ్బాయి పలాయనం చిత్తగించి ధన్యుడైనాడు. లేకుంటే ఉరిపిడ వాడిని మార్కెట్లో పెట్టి అమ్మినా ఆశ్చర్యం లేదు.

సాయంత్రం ఆ అమ్మాయిని ఎగరేసుకెళ్ళే ఛాన్సు ఎవరు కొట్టేస్తారో చూద్దామని ఎక్కడికీ వెళ్ళకుండా రూములోనే కూర్చున్నాను.

అయిదయింది.

ప్రక్క గది తలుపుతీసిన చప్పుడైంది. చెప్పులు వేసుకుంటూన్న శబ్దం వినిపించింది. క్షణమాగి తల బైట పెట్టి చూచాను. పంచాయితీ ప్రెసిడెంటు యిచ్చిన బట్టల పాకెట్టూ, మందుల కుర్రాడిచ్చిన టాయిలెట్ సామాన్ల పాకెట్టూ తీసుకుని కుడిచేతికి స్క్వేర్ వాచీ పెట్టుకుని స్టైల్‌గా నడిచి వెళ్తూంది. మరో రెండు నిమిషాలాగి బాల్కనీ లోంచి క్రిందికి చూచాను. ఆమె రిక్షా ఎక్కి వెళ్ళిపోతూంది.

ఆరు కాబోతూండగా బాల్కనీలో కుర్చీ వేసుక్కూర్చున్నాను. ప్రెసిడెంటు హడావుడిగా వచ్చి ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని, సెంటు పులుముకుని పదహారులో కెళ్ళాడు 'బుల్లీ' అంటూ. వెంటనే వెనక్కి తిరిగి ఎదురుగా వుండే రెండు గదులకేసి చూచి పళ్ళు పటపట కొరికాడు. కాసేపటికి మందుల కుర్రాడు వచ్చి డ్రెస్సప్ అయి 'అయాం సారీ మాడమ్' లోపలికెళ్ళి అర్జంటుగా వెనక్కి తిరిగి వచ్చేశాడు కళ్ళజోడు సవరించుకుంటూ.

అప్పుడే టాక్సీలో దిగిన వ్యాపారస్తుడు నిమిషంలో తయారయిపోయి ఓ చిన్న ట్రాన్సిస్టర్ను భుజానికి వ్రేలాడేసుకుని '[illegible]' అంటూ లోపలికెళ్ళి విసురుగా వెనక్కి వచ్చేసి బిగ్గరగా ట్రాన్సిస్టరు ట్యూను చేయసాగాడు.

ఆ రాత్రి హాకు పని వున్న పెద్దమనిషి

వడం, నా వనిగావడం కూడా జరిగి పోయాయి ఉదయం రైలుకు ప్రయాణం కట్టాము.

* * *

'ఇది యిలా జరిగితే బాగుండును' అను కోన్నది జరగపోవడం సహజం, 'ఇది యిలా జరిగివుంటే బాగుండును' అన్నది జరిగి పోవడం కూడా సహజమే! హోటల్లో అమ్మాయి, అబ్బాయి మళ్ళీ కలుసుకుని కథ సుఖాంతం కావాలని గాని, కలుసుకో కుండా కథ దుఃఖాంతం కావాలని గాని నేను అనుకోలేదు. తీరామారా నా మనసులో వాళ్ళను గురించి మిగిలినది ఒక అస్పష్టమైన అభిప్రాయం మాత్రమే!

కాని ఆఖరి స్టేషన్లో బండి ఆగి నప్పుడు ప్లాట్‌ఫారంమీద నిల్చున్న ఆ జంటను చూసి నేను ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయినమాట వాస్తవం!

బండిలో మరెక్కడా చోటులేనట్టు వాళ్ళు నేనున్న పెట్టెలోనే ఎక్కుకుంటే, ఆ పెట్టెలోనూ మరెక్కడా స్థలం లేనట్టు నా కెదురుగానే కూర్చోకుంటే, ఆనాడు హోటల్లో జరిగిన వుదంతం పది మంది మిత్రులమధ్య కూలాగా చెప్పు కుందుకే అనువుగా వుండేది!

వాళ్ళని పలకరించి మరోసారి అతని చేత అవమానించబడటం యిష్టంలేక పేపరుతో ముఖం చాటు చేసుకున్నంత మాత్రాన అతగాడు నన్ను వదిలిపెట్టలేదు. ప్రక్కనే కూర్చుని పేపరును లాగి అవతల పెట్టినప్పుడు నాకు కోపం రాకపోయినా వచ్చినట్టు నటించాను.

'నన్ను ఫూల్‌ని చేస్తున్నావా? నిన్న నాటకం ఏమిటి? నువ్వు జగన్నాథానివా, మధువా?'

'ఒరేయ్. గట్టిగా అరవకు యిలా దగ్గరగా రావోయ్ శశి ఏవరో తెలుసా నా ప్రేమ మూర్తి — ఈమె నా భార్యోయ్' అన్నాడు.

'ఇంతకీ నువ్వెవరో చెప్పలేదు.'

'నేను నీ జగన్నాథంరా భాయ్.'

'అయితే నిన్న కిళ్ళీకొట్టు దగ్గర...'

'వాడు కూడా నేనేరా భాయ్. ఇంకా నీవు తికమకలోనే వున్నావ్. ఇలా చూడు.' అంటూ మీసాలు చేత్తోతీసి జేబులో వేసు కున్నాడు. నా మెదడు మళ్ళీ ఒకసారి మొద్దుబారిపోయింది.

'రిట్రెంచిమెంటు ధర్మమా అని రెండేళ్ళ నుంచి చేస్తూన్న వుద్యోగం వూడిపోయింది. ఎంతమందినో ఆశ్రయించాను. పని దొరకలేదు. ఒకపూట తినీ, ఒక పూట తినకా కొన్నాళ్ళు గడిపాం. కూలి పని చేశాను. కష్టమెక్కువైంటే గాని, కడుపు నిండింది గాదు. ఎంతో ఆలోచించి, ఎంతో తెగువతో, మొండిధైర్యంతో యీ నాటకం ఆడుతున్నాం. ఇందులో నా పాత్ర లేకికే! కాని మా శశి మాత్రం చాలా కష్టపడుతూంది. కాని ఏం చేయడం? పరిస్థితులవల్ల మేము యిలాంటి నికృష్టస్థితికి దిగజారి పోయాం.' చెప్తూ పోతున్నాడు జగన్నాథం. ఆ అమ్మాయి కేసి చూచాను. ఎంతో అమాయకంగా వుంది. కన్నీరు ఆవిడ చెంపల మీంచి సంతతధారగా కారిపోతున్నాయి.

'అయితే యిలా ఎన్నాళ్ళు మానవుల బలహీనతల మీద జీవిస్తారు?'

'యిక ఎన్నాళ్ళో లేదు. అయిదువేలకు రెండువందలు తక్కువ. ఇదే నాటకాన్ని చివరిసారిగా ఆడి ఆపేస్తాం. వెంటనే ఓ వ్యాపారం ప్రారంభిస్తాను. అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి కూడాను.'

ఓ పెద్ద స్టేషన్లో బండి ఆగింది. నిన్న జరిగినదానికి క్షమాపణలు చెప్పి వాళ్ళిద్దరూ దిగిపోయారు అక్కడ బండి చాలసేపు ఆగుతుంది. వాళ్ళిద్దర్నీ గేటు దాకా సాగనంపి ప్లాటుఫారం మీద పచార్లు చేస్తున్నాను.

గేటు వద్ద టికెటు కలెక్టరు ఎవరో ప్రయాణికుడు టిక్కెట్టు బదులు చేతిలో పెట్టిన రెండు రూపాయల నోటును చిరు నవ్వుతో అందుకుని జేబులో వేసుకున్నాడు. ఒకానొక భారీ మనిషి మూడో తరగతి టిక్కెట్టు గేటులో చూపి మొదటి తరగతి పెట్టెలో దర్జాగా ఎక్కి కూర్చున్నాడు. కిటికీ వద్ద కూర్చున్న ఓ పెద్ద మనిషికి పచ్చనోటు యిస్తూ. 'ఇది తమ వద్ద వుంచండి. పనయితే మీ శ్రమ వృథా పోదులెండి' అంటున్నాడో యువకుడు. లగేజి బుక్‌చేయమని మొరాయించిన పార్సెలు గుమాస్తా చేయి తడిచేసి బుక్ చేయించు కున్న వైనం వో పెద్దమనిషి స్నేహితుడికి వర్ణించి చెబుతున్నాడు.

వీళ్ళంతా నిజాయితీ పరులేనా?

మోసగాళ్ళు కాని దెవరు?

ఉద్యోగం వూడి, పూట గడవక, మనుష్యుల్ని ఫూల్సుచేసి బ్రతుకుతున్న జగన్నాథం మోసగాడా?

డబ్బుకూ, ఆర్ద్రతకూ పెట్టిన పరుగు పందెంలో డబ్బుదే గెలుపు కాగలిగేట్టు చేయగల మన వ్యవస్థకు కాయకల్ప చికిత్స జరిగే దెప్పుడు?

స్టేషను వెలుపల రిక్షా మాట్లాడు తుంటున్న జగన్నాథం, వాడి ప్రక్కనే మెరిసే కళ్ళతో నిల్చున్న శశినిచూస్తూంటే నా మనసు జాలితో నిండిపోయింది. ●

